క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతు


మరమ్మతు చేపడుతున్న గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామం నుంచి మన్మద్ ఎక్స్‌రోడ్డు వరకు గ్రామస్తులు సోమవారం మరమ్మతు చేపట్టారు. అడుగడుగున గుంత ఏర్పడంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి విన్నవించడంతో రూ.2 లక్షల మంజూరుకు కృషి చేస్తామని చెప్పగా గ్రామస్తులు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టారు. మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, నాయకులు భోజన్న, నాగేష్, భూమన్న, భోజారెడ్డి, రాములు, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నర్సాపూర్(జి): మండలంలోని డొంగుర్గాం గ్రామానికి చెందిన ధనే వినయ్ ఇటీవల అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌ఓసీని సోమవారం బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు. నాయకులు తూర్పాటి వెంకటేశ్, బుచ్చన్న, ఖదీర్, సంతోష్ పటేల్, సాగర్ రావు, దిగంబర్ ఉన్నారు.

సహజ వనరుల సంరక్షణపై అవగాహన కల్పించాలి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న దిగంబర్

భైంసారూరల్: సహజ వనరుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏకలవ్య ఫౌండేషన్ నిర్వాహకుడు దిగంబర్ అన్నారు. మండలంలోని మాటేగాం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమాజ సేవకులకు పర్యావరణ సంరక్షణ భావితరాలకు భరోసా అనే అంశానికి సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. యువత పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలన్నారు. మనోరమ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా.నాగేశ్, గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సలహా సంఘం సభ్యులు నిఖిల్‌రెడ్డి, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం తాలుకా అధ్యక్షులు మోహన్, అశోక్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


అరుణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌రూరల్ మండల నూతన ఏపీఎంగా అరుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బోస్ దిలావర్‌పూర్‌కు బదిలీ అయ్యారు. గతంలో అరుణ మామడలో పనిచేశారు. బదిలీపై ఇక్కడకు వచ్చి బాధ్యతలు చేపట్టిన ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు. సీసీలు నర్సయ్య, జ్యోతిర్మయి, రేఖ, భోజన్న, అకౌంటెంట్ సుజిత, ఆపరేటర్ రవి ఉన్నారు.

దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్: మండల ఏపీఎంగా రమేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నార్నూర్‌లో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన వ్యక్తి బదిలీపై కడెంకు వెళ్లారు. ఇరువురు ఏపీఎంలకు రైతు వేదికలో ఐకేపీ సిబ్బంది సన్మానించారు.

గణేశ్ ఉత్సవ కమిటీ ఎన్నిక

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో సోమవారం ప్రసిద్ధి కర్రవినాయక ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉత్తమ్ బాలేరావ్, ఉపాధ్యక్షుడిగా కర్షల పెద్ద నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా గాడె గంగాప్రసాద్, కోశాధికారిగా తుంగెన్ శంకర్, సభ్యులుగా శ్రీ బాయినాగేశ్, ఎమ్మాయి నాగప్ప, బ్యాగల్ రఘునాథ్, నీలం నర్సయ్య, శ్రీ దివిసి నర్సింలు, అల్లకొండ సత్యనారాయణ, తుంగెన మురళి, సల్ల నాగేశ్ ఎన్నికయ్యారు.

వరదొస్తే ఆగాల్సిందే

- చిన్నపాటి వర్షాలకే మునుగుతున్న లోలెవల్ వంతెనలు
- ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు
- రాకపోకలకు తీవ్ర అవస్థలు
- పట్టించుకోని అధికారులు


ఇటీవల కురిసిన భారీ వర్షానికి తానూరు మండలంలోని ఝరి(బి) గ్రామంలో లోలెవల్ వంతెనపై వరద నీరు ప్రవహించింది. కూలీలను వంతెన దాటించేందుకు యువకులు సాయం చేశారు. వర్షాకాలంలో ఏటా గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. భైంసా డివిజన్‌లోని పలు గ్రామాల్లో వర్షాకాలంలో లోలెవల్ వంతెనలు నీట మునుగుతున్నాయి. వరదలొస్తే ఊరుదాటని పరిస్థితి. బిడ్జి నిర్మించాలని 50 ఏళ్లుగా నాయకులు, అధికారులకు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు.


ఝరి(బి) వద్ద వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)


మొగ్లి సమీపంలోని లోలెవల్ వంతెనపై పారుతున్న వరద నీరు (ఫైల్)

సరిహద్దు గ్రామాల రోడ్డు మార్గంలో..

తానూరు: భైంసా డివిజన్‌లోని తానూరు, కుభీర్, భైంసా, ముధోల్, కుంటాల మండలాలు మహారాష్ట్రకు సరిహద్దు ప్రాంతంలో ఉన్నాయి. తానూరు మండలంలోని ఝరి(బి), వడ్‌ఝరి(బి), మొగ్లి, వాడవన, మహలింగి, కుభీర్ మండలం బెల్‌గాం, భైంసా మండలం గుండెగాం, ముధోల్ మండలం మచ్కల్, ముద్గల్, బోరిగాం, కుంటాల మండలం ఓలా, సుర్యాపూర్ గ్రామాల మధ్య, ఓల నుంచి లింబాబి మధ్య, కొత్త వెంకురు నుంచి పాత వెంకుర్ మధ్య, గ్రామాలకు గత ఏళ్ల క్రితం నిర్మించిన లోలెవల్ వంతెనలు ఉన్నాయి. చిన్నపాటి వర్షానికి వంతెనలు నీటమునుగుతున్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఝరి(బి), తొండాల, దౌలతాబాద్, వాడవన, మొగ్లి గ్రామాలకు వెళ్లేదారిలో వంతెనలపై వెళ్లలేకపోయారు. చిన్నపాటి వర్షాలు కురిస్తే లోలెవల్ వంతెనలపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అత్యవసర వేళ ప్రజలు ఊరు దాటని పరిస్థితి. ఏళ్లుగా ఈ వంతెనలతో సరిహద్దు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వీటి ప్రదేశంలో బ్రిడ్జిలు నిర్మించి తమ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

గ్రామాల ప్రజల రాస్తారోకో

ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఝరి(బి) లోలెవల్ వంతెనపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఝరి(బి), ఝరి(బి)తండా గ్రామాల ప్రజలు బెల్‌తరోడా జాతీయ రహదారిపై రాస్తారోకో, ధర్నా చేపట్టారు. బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి సందర్శనకు విచ్చేసిన ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. గతేడాది భైంసాలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ కలిసి లోలెవల్ వంతెన వద్ద బ్రిడ్జి నిర్మించాలని విన్నవించినా ఫలితం లేకపోయింది.

పట్టించుకోవడం లేదు

ఝరి(బి) సమీపంలో బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదు. వర్షాలు కురిసి వరదలు వస్తే కష్టాలు పడుతున్నాం. వరదొస్తే బయటకు వెళ్లలేకపోతున్నాం. – సాయినాథ్, ఝరి(బి)

ప్రతిపాదనలు పంపించాం

ముధోల్, తానూరు మండలాల్లో లోలెవల్ వంతెన వద్ద అవసరం ఉన్నచోట బ్రిడ్జి మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే బ్రిడ్జి నిర్మిస్తాం. మొగ్లి, ఝరి(బి), మహలింగి, వాడవన, మచ్కల్, ముద్గల్ గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం. – జాదవ్ చందు, పీఆర్ డీఈ

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కారం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద


తానూరు: పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు

నర్సాపూర్(జి): పుట్టిన బిడ్డలకు తల్లిపాలు శ్రేయస్కారమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ విశారద అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నర్సాపూర్ (జి), రాంపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం గర్భిణులు, మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గంగామణి, అరుణ, గంగవ్వ, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: ధర్మారం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాల మోతాదు, పాలిచ్చే తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల ఆరోగ్య కార్యకర్త శివక్రిష్ణ వివరించారు. అంగన్‌వాడీ టీచర్ శ్రీ గీత, ఆశ నవనీత పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని 1, 2వ అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సావిత్రి, అనిత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెంబి: చింతగూడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ భూక్యా సునీత, ఏఎన్ఎం గౌతమి, సురేష్‌రెడ్డి, రాజుకుమార్ వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

రేపు అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూ

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలోని ఎంజేపీ పాఠశాల, కళాశాలలో భౌతిక, పౌరశాస్త్రాలు బోధించేందుకు అతిథి అధ్యాపకులకు జిల్లాకేంద్రంలోని దివ్యనగర్‌లో మహాత్మా జ్యోతిబాపూలే బాలికల కళాశాలలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఆర్సీఓ ఎస్.శ్రీధర్, నిర్మల్ డీసీవో గీత ప్రకటనలో తెలిపారు. జనరల్ కేటగిరిలో పౌరశాస్త్రం-1, జనరల్ కేటగిరీలో భౌతిక శాస్త్రం-3, మహిళా కేటగిరీలో భౌతికశాస్త్రం-2 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆయా సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఎడ్‌తోపాటు టెట్ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 9154102669 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీజేపీతో అభివృద్ధి

ఖానాపూర్: బీజేపీతో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. పట్టణంలోని 1వ వార్డు పరిధి 237 బూత్ పరిధిలో సోమవారం బీజేపీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలన, పథకాల అమలు, తదితర విషయాలను వివరించారు. నాయకులు బత్తుల నారాయణ తదితరులు ఉన్నారు.


ఇంటింటి ప్రచారంలో నాయకులు

ప్రజలను మభ్యపెట్టేందుకే పాదయాత్ర

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్

ఖానాపూర్: ఎన్నికల హామీలు నెరవేర్చని ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టేందుకే పాదయాత్ర చేపట్టిందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పాదయాత్ర పేరుతో ఫొటో షూట్లు, ఫ్లెక్సీల ప్రచారహోరు తప్ప ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. ఎన్నికలకు ముందు డిక్లరేషన్లు, బాండు పేపర్లు ఇచ్చి మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం పనితీరులో పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకే హడావుడి చేస్తున్నారని పేర్కొన్నారు. పాదయాత్ర పేరిట ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సమావేశంలో నాయకులు మోహిద్, వాల్‌సింగ్, రాజు, గజేందర్, నరేందర్, ప్రదీప్, శ్రావణ్, దివాకర్, నసీర్, ఫహీం, షోయబ్, తిరుమలేష్, కళావతి, పీరాజి, శ్రీనివాస్, వాహబ్, రాజేశ్వర్, రాకేశ్, సుమన్, షఫీ, మహిపాల్, అజయ్, మజర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ప్రజాసమస్యల ప్రస్తావన లేకుండానే పాదయాత్ర

ఖానాపూర్: రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ప్రజా సమస్యల ప్రస్తావన లేకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల కోసం పాదయాత్ర చేపట్టిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆకుల శ్రీనివాస్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్ అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. పాదయాత్ర పేరుతో వచ్చిన పార్టీ నాయకులు, రాష్ట్రమంత్రులు సైతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా సమస్యలతోపాటు నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ సమస్యల ప్రస్తావన లేకుండానే జనహిత యాత్ర చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జీ మెప్పు కోసమే యాత్రలో పాల్గొన్నారే తప్ప జనహిత పాదయాత్రతో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. సమావేశంలో నాయకులు పుప్పాల ఉపేందర్, గడ్డం రవీందర్, చిలుకూరి గిరి, పిట్టల భూమన్న, అనిల్‌రావు, లింబాద్రి, వెంకట్రాములు, స్వామి, శ్రావణ్, రవీందర్, శ్రీనివాస్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇనుప స్తంభాలు తొలగింపు


తొలగిస్తున్న సిబ్బంది

మామడ: మండలంలోని పొన్కల్‌లో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలు తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దాదాపు 40 ఏళ్ల క్రితం అమర్చిన ఇనుప స్తంభాలు తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామస్తులు పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 27 ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్‌వి అమర్చినట్లు ఏఈ బాలయ్య తెలిపారు.

సమష్టి సహకారంతో జనహిత యాత్ర జయప్రదం

ఖానాపూర్: కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలతోపాటు అన్నివర్గాల సమష్టి సహకారంతో జనహిత పాదయాత్ర జయప్రదమైందని మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్ అన్నారు. పట్టణంలో ఏర్పాటుచేసిన సోమవారం సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ, బంజారా గిరిజనులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు వారి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా యాత్రకు స్వాగతం పలికారన్నారు. యాత్రను జయప్రదం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త రేషన్‌కార్డుల పంపిణీ


రేషన్ కార్డు అందజేస్తున్న కార్యదర్శి ప్రసాద్‌గౌడ్

బాసర: బాసర పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ప్రసాద్ గౌడ్ సోమవారం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సంజీవ్‌రావు, కృష్ణ, సాయిలు, శ్యామ్‌పటేల్, ప్రసాద్, పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మామడ: స్థానిక కేజీబీవీలో వంట సహాయకురాలిగా విధులు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి జ్యోతి ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హతతోపాటు 360 మందికి వంట చేయగల అనుభవం ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఎమ్మార్సీలో దరఖాస్తులు అందించాలని కోరారు.

నేడు రైతునేస్తం కార్యక్రమం

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్లస్టర్ ఏఈవో పవిత్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పామాయిల్ సాగులో యాంత్రీకరణ అంశంపై ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేస్తారని పేర్కొన్నారు.

శయనస్థితిలో భద్ర మారుతి!

- ఇక్కడ దర్శనమివ్వడం ప్రత్యేకత
- జ్యోతిర్లింగ దర్శనానికి తరలిరానున్న భక్తులు
- శ్రావణమాసంలో ప్రత్యేకం


కుంటాల: భక్తాంజనేయుడిగా, వీరాంజనేయుడిగా, వరాల ఆంజనేయుడిగా, ప్రసన్నాంజనేయుడిగా, అభయాంజనేయుడిగా, మారుతిగా అభయమిచ్చే ఆంజనేయుడు ఎక్కడ చూసిన నిల్చొని దర్శనమిస్తాడు. ఇందుకు పూర్తి భిన్నంగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్ (ఛత్రపతి శివాజీ సంబాజీనగర్) జిల్లా రత్నాపూర్‌లోని దివ్యక్షేత్రంలో భద్రమారుతి శయనస్థితిలో(పడుకుని) భక్తులకు దర్శనమివ్వడం ఇక్కడి ప్రత్యేకత. శ్రావణమాసంలో ప్రతీ శనివారం భద్ర మారుతి, ఘృష్ణేశ్వర్‌లోని 12వ జ్యోతిర్లింగం దర్శనానికి తెలంగాణ నుంచేకాక ఉమ్మడి ఆదిలాబాద్ జిలా నుంచి భక్తులు తరలివెళ్లి పూజలు నిర్వహిస్తుంటారు.

ఆలయ చరిత్ర..

పూర్వం భద్రావతి నగరాన్ని భద్రసేనుడు అనే రాజు పరిపాలించేవాడని పూర్వీకులు చెబుతున్నారు. ఈయన శ్రీరామభక్తుడు కాగా, ప్రతినిత్యం భజనలు, కీర్తనలు చేసేవాడు. ఓ రోజు భద్రకుండ సరోవరం వద్ద పూజలు చేయగా అతని మధుర గానం విని పరవశించిన హనుమంతుడు తన్మయంతో అక్కడే నిద్రపోయాడని చెబుతుంటారు. హనుమంతుడు భద్రసేనుడి రామ భక్తికి మెచ్చుకుని వరం కోరుకో అని అడగగా..ఈ క్షేత్రంలోని కొలువై ఉండాలని భద్రసేనుడు కోరగా హనుమంతుడు ఇక్కడ వెలిసినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది.

ఆలయ ప్రత్యేకత

శ్రీరామదూతం.. శిరసానమామి అంటూ హనుమంతుని నామస్మరణతో భద్ర మారుతి ఆలయం నిత్యం మార్మోగుతుంది. ఆలయానికి వెళ్లే ముందు భక్తులకు ముఖద్వారం దర్శనమిస్తుంది. ముందు భాగంలో పెద్దపెద్ద గంటలు ఉంటాయి. స్వామివారిని దర్శనానికి వచ్చామని చెప్పడానికి గుర్తుగా గంటను మోగిస్తారు. ప్రధాన ఆలయానికి క్యూలో వెళ్తారు. విశాలంగా ఉన్న ఆలయం మైమరిపిస్తుంది. పైభాగాన గాజు అద్దాలపై హనుమాన్ చాలీసా ఉంటుంది. భక్తులు ముందుగా స్వామివారి పాదాల వద్ద పూజలు చేస్తారు. పడుకుని ఉన్న హనుమంతుడిని పూజిస్తారు. ఆలయం బయట తులసికోట వద్ద పూజలు చేసి, శనీశ్వరున్ని దర్శించుకుంటారు. మహిళలకు ఆలయంలో ప్రవేశం లేదు. వీరికి బయట నుంచి కనిపించేటట్టుగా అద్దం ఏర్పాటు చేశారు. భద్రమారుతి ఆలయానికి సుమారు 4 కి.మీ దూరంలో సులిబంజన్ దత్తాత్రేయ స్వామి మందిరం ఉంది.


రత్నాపూర్‌లోని భద్ర మారుతి ఆలయం


శయన స్థితిలో దర్శనమిస్తున్న భద్ర మారుతి

ఘృష్ణేశ్వర్‌లోని 12వ జ్యోతిర్లింగ దర్శనం

శ్రావణమాసంలో ఇక్కడి నుంచి మహారాష్ట్రలోని గృష్ణేశ్వర్‌లో జ్యోతిర్లింగం కొలువై ఉంది. ద్వాదశ జ్యోతిర్లింగాలో ఒకటైన 12వది అయినా జ్యోతిర్లింగం మహారాష్ట్రలోని వేరుల్ గ్రామ సమీపాన శివాలయం తీర్థస్థానంలో దివ్య జ్యోతిర్లింగాన్ని భక్తులు దర్శించుకుంటారు. ఆలయ సమీపాన అజంతా ఎల్లోరా గుహలను భక్తులు సందర్శిస్తారు. గుహల్లో ఉన్న చిత్రాలు, శిల్పాలను చూసి మంత్రముగ్ధులవుతారు. మహారాష్ట్రతోపాటు తెలంగాణ జిల్లాల నుంచి ప్రతీ శనివారం భక్తులు ఆలయాలకు వెళ్తారు.

ఇలా వెళ్లాలి

మహారాష్ట్రలోని భద్ర మారుతి, ఘృష్ణేశ్వర్ ఆలయాలకు బస్సు, రైలు సౌకర్యం ఉంది. నిర్మల్ నుంచి ఔరంగాబాద్ 340 కి.మీ, ఔరంగాబాద్ నుంచి భద్ర మారుతి 29 కి.మీ. భద్ర మారుతి నుంచి జ్యోతిర్లింగం, అజంతా ఎల్లోరా గుహలు 6 కి.మీ దూరంలో ఉన్నాయి.

ఆరేళ్లుగా వెళ్తున్నా..


శ్రావణమాసంలో ఐదె కరాల భద్ర మారుతి, జ్యోతిర్లింగం దర్శనానికి వెళ్తుంటాను. ఇప్పటివరకు ఆరు సార్లు వెళ్లినా. అంతా మంచే జరుగుతుంది. – రజనీకాంత్‌రావు, కల్లూరు

కోర్కెలు నెరవేరుతాయి


రత్నాపూర్‌లో భద్ర మారుతి పడుకుని దర్శనం ఇవ్వడం ప్రత్యేకత. ఇక్కడి సమీపంలో దివ్య జ్యోతిర్లింగం దర్శించడం మహాద్భుతం. కోరిన కోర్కెలు తీరడంతో దర్శనం కోసం వెళ్తుంటాను. – గంగాధర్‌గౌడ్, భైంసా

కిటకిటలాడిన శివాలయాలు

నిర్మల్‌టౌన్/కుంటాల/లోకేశ్వరం: శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల్‌లోని గండి రామన్న క్షేత్రంలోని శివాలయంలో సాయిదీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.


పూజల్లో సాయిదీక్ష సేవ సమితి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి


సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వరాలయంలో భక్తుల పూజలు

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో మాట్లాడారు. గూడెలలో ఆదివాసీ జెండాలు ఆవిష్కరించి, ర్యాలీలు, సభ నిర్వహించాలన్నారు. ఇచ్చోడలో నిర్వహించే కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో రాయిసెంటర్ సార్‌మేడి మెస్రం శంభు, తుడందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, ఆత్రం మహేందర్, పటేల్ భీంరావు, మెస్రం దేవురావు, సంగేపు రమేశ్, అడ భీంరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు